సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 8లో ▸



సభ్యత్వం కల్పించాలి

మత్స్య సహకార సంఘాల్లో తమకు సభ్యత్వం కల్పించాలని ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.4 /11.8

వాతావరణం

ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రేపు దిశ సమావేశం

కామారెడ్డి అర్బన్ : కలెక్టరేట్‌లో శనివారం ఉదయం 11గంటలకు జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఆర్డీవో సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న అభివృద్ధి పథకాలపై సమీక్ష ఉంటుందని, జిల్లాలోని శాసన సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

'పోషక విలువలున్న చేపలు పెంచాలి'



కామారెడ్డి అర్బన్ : అత్యంత పోషక విలువలున్న చేపలను పెంచడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి పేర్కొన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీపతి మాట్లాడుతూ కళాశాలలో చేపల పెంపకంపై ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఆసక్తిగా ఉన్నారని, దీనిని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, ఫిషరీస్ హెచ్‌వోడీ తిరుమల మల్సూర్, సమన్వయకర్తలు జయప్రకాష్, దినకర్, శ్రీనివాస్, అధ్యాపకులు మానస, పవన్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మరో రూ.20 లక్షలు మంజూరు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గల్ఫ్ దేశాలలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించేందుకుగాను జిల్లాకు మరో రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తోంది. తొలి విడతగా గతనెలలో రూ.20 లక్షలు విడుదలైన విషయం తెలిసిందే.

డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు

భిక్కనూరు: విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని రామేశ్వర్‌పల్లికి చెందిన రైతు పెద్దోళ్ల శరత్‌రెడ్డి ఆరోపించారు. గతేడాది జనవరి 15న భిక్కనూరు శివారులోని తన పొలం వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. అప్పటి నుంచి విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా తనకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశానని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరానన్నారు.

మహిళా శక్తి భవనానికి నిధులు మంజూరు



కామారెడ్డి క్రైం : జిల్లా కేంద్రంలో ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మహిళా శక్తి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి భవన నిర్మాణానికి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వే నంబర్ 527లో ఎకరం భూమిని కేటాయించామన్నారు. ఇక్కడ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గాప్రసాద్, డీపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అండర్-19 కబడ్డీ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతున్న ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 11 గంటలకు వ్యాయామ ఉపాధ్యాయుడు మహేశ్ వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు 23, 24, 25 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో ముదిరిన లొల్లి..!

అధికార కాంగ్రెస్ పార్టీలో విభేదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్త, పాత నేతల మధ్య ఆధిపత్య పోరు తీవ్రమవుతోంది. ఎమ్మెల్యేలు పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడి పనిచేసిన వారిని నిర్లక్ష్యం చేసి కొత్తగా చేరిన వారికి పదవులు ఇస్తున్నారంటూ ఆయా నియోజకవర్గాల్లో నేతలు తిరుగుబాటు చేస్తున్నారు. గ్రూపు తగాదాలు రచ్చకెక్కుతుండడంతో శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి.

కొత్త, పాత నేతల మధ్య ఆధిపత్య పోరు

- బాన్సువాడలో రోడ్డెక్కిన ఏనుగు వర్గం
- గాంధీ భవన్ మెట్లెక్కిన జుక్కల్ నేతలు
- ఎల్లారెడ్డిలోనూ గ్రూపు తగాదాలు
- అయోమయంలో పార్టీ శ్రేణులు



గాంధీభవన్ మెట్లపై బైఠాయించిన జుక్కల్ నియోజక వర్గ కాంగ్రెస్ నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు తారస్థాయికి చేరుతున్నాయి. అన్ని నియోజకవర్గాలలో ఆధిపత్యం కోసం పాత, కొత్త నేతలు ఎవరికి వారు ప్రయత్నిస్తున్నారు. దీంతో గొడవలు పెరిగిపోతున్నాయి. నామినేటెడ్ పదవుల విషయంలో ఎమ్మెల్యేల మాటే చెల్లుబాటవుతుండడంతో మరో వర్గం నిరాశకు లోనవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి నేతలు ఉత్సాహం చూపుతుండడంతో టికెట్ల కేటాయింపు సమయంలో విభేదాలు మరింత రచ్చకెక్కుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బాన్సువాడలో..

బాన్సువాడ నియోజక వర్గంలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇక్కడ నిత్యం ఏదో ఒక గొడవ నడుస్తూనే ఉంది. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా తానే బాస్‌నని పోచారం అంటుండగా, నియోజకవర్గ ఇన్‌చార్జీగా తానే ఉన్నానని ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొంటున్నారు. బాన్సువాడలో ఏనుగుకు ఏం పని అంటూ ఇటీవల పోచారం ప్రశ్నించారు. తాను బాన్సువాడను వదిలివెళ్లే ప్రసక్తే లేదని, ఇక్కడే ఉండి కార్యకర్తలకు అండగా నిలుస్తానని ఏనుగు రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు పోచారం వర్గానికే దక్కుతుండడంతో ఏనుగు వర్గానికి చెందిన నేతలు ఆందోళనలూ చేస్తున్నారు. బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకం విషయంలో పాత వారిని కాదని కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవి ఇస్తే ఊరుకునేది లేదంటూ గురువారం కాంగ్రెస్ నేతలు రోడ్డెక్కారు. పార్టీకోసం కష్టపడ్డవారికే పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జుక్కల్‌లో..

జుక్కల్ నియోజక వర్గంలో స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకం విషయంలో వినూత్న పద్ధతి అవలంబించారు. ఈ విషయంలో ఆయన పార్టీ నాయకత్వం నుంచి అభినందనలు అందుకున్న మరుసటి రోజే నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు కొందరు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, నిజాంసాగర్ మండలాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు గాంధీభవన్‌కు వెళ్లి నిరసన తెలిపారు. పదవుల విషయంలో ఎమ్మెల్యే తమకు అన్యాయం చేస్తున్నారని, సీనియర్లని కూడా చూడకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు 'సాక్షి'తో మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. పార్టీకి నష్టం చేసిన ఒకరిద్దరు నేతలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డ ఒకరు కలిసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తాను న్యాయం చేస్తున్నానన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వర్గానికి, సుభాష్‌రెడ్డి వర్గానికి మధ్య ఎప్పుడూ ఏదో ఒక గొడవ జరుగుతూనే ఉంది. ఇటీవల సుభాష్‌రెడ్డి వర్గం నేతపై ఎమ్మెల్యే వర్గీయులు దౌర్జన్యం చేశారంటూ సుభాష్‌రెడ్డి రచ్చ చేశారు. ఎమ్మెల్యేకు దమ్ముంటే నేరుగా తనతో తలపడాలని, తన అనుచరుల జోలికి వస్తే ఊరుకోనని హెచ్చరించారు. సుభాష్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే అనుచరులు గట్టిగానే స్పందించారు. ఎమ్మెల్యేను ఒక్క మాట అన్నా ఊరుకోమని హెచ్చరించారు.

కామారెడ్డి నియోజక వర్గంలోనూ కింది స్థాయిలో పాత, కొత్త నేతల మధ్య విభేదాలున్నాయి. అయితే అందరూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెంటే ఉండడంతో విభేదాలు బయట పడడం లేదు.

జుక్కల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు

- గాంధీభవన్ వద్ద ధర్నాకు దిగిన నేతలు
- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుపై ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జుక్కల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుపై తిరుగుబాటు చేశారు. నియోజక వర్గంలోని ఆయా మండలాలకు చెందిన కొందరు నాయకులు గురువారం గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుపై పలు ఆరోపణలు చేస్తూ పార్టీ ముఖ్య నేతలకు ఫిర్యాదు చేసినట్టు ప్రకటన విడుదల చేశారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడుతున్న వారిని వదిలి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వచ్చిన వాళ్లకు పదవులు ఇస్తున్నారని, మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయంటూ ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ వసూళ్లు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని జుక్కల్, బిచ్కుంద, నిజాంసాగర్, మద్నూర్, పెద్ద కొడప్‌గల్ మండలాలకు చెందిన పలువురు మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు సొదాగర్ అరవింద్, కమల్ కిషోర్, వినోద్, సంగమేశ్వర్, జయప్రదీప్, పాటిల్ లక్ష్మణ్, మాణిక్‌రావు, సురేశ్, మొగులయ్య, లక్ష్మీబాయి, ఎం గంగారాం, కె శంకర్, హన్మాండ్లు తదితరులు గాంధీభవన్‌కు వెళ్లి పీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వైఖరిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరి మూలంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మురిగిపోయాయని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నేతలకు కనీస గౌరవం ఇవ్వకపోవడమే గాకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆరోపించారు.

కన్న పేగు భారమయ్యిందా?!

- అమ్మను ఆస్పత్రిలో వదిలివెళ్లిన కుటుంబ సభ్యులు
- ఫోన్ చేసినా స్పందించని వైనం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయవ్వ

కామారెడ్డి క్రైం : నవమాసాలు కడుపులో మోసి, కని పెంచిన తల్లి.. వృద్ధాప్యంలో తన సంతానానికి భారమైంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ధర్మాసుపత్రిలో చేర్చి వదిలించుకుని వెళ్లిపోయారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గీకురు సాయవ్వ అనే 70 ఏళ్ల వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించాడు. పదేళ్ల క్రితం వారి కుటుంబం కామారెడ్డికి మకాం మార్చింది. ఈనెల 18 న సాయవ్వ కాలు జారి పడిపోవడంతో చేయి విరిగింది. మరుసటి రోజు ఆమెను కూతురు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయింది. అప్పటినుంచి కూతురు సరోజన, రెండో కుమారుడు వెంకటేశ్, కోడలు రాజేశ్వరిలలో ఎవరూ ఆమె వద్దకు రాలేదు. ఆస్పత్రి వర్గాలు వారికి ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిసింది. అందరూ ఉన్నా అనాథగా మారిన సాయవ్వ బాగోగులను ఆస్పత్రి వైద్య సిబ్బంది, పోలీస్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌రావు చూసుకుంటున్నారు. కుమారుడు, కూతురు వచ్చి సాయవ్వను తీసుకువెళ్లాలని కోరుతున్నారు.

డీపీవోను సందర్శించిన ఐజీ

కామారెడ్డి క్రైం: పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేశ్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఎస్పీ సింధు శర్మ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని, నిర్మాణంలో ఉన్న సిబ్బంది విశ్రాంతి గదులు, జిమ్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.



ఐజీ రమేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ సింధు

'మూడు రోజుల్లో సర్వే పూర్తవ్వాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మూడు రోజుల్లో పూర్తి చేసి డాటా ఎంట్రీ ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులతో మాట్లాడారు. ఇంటింటి సమగ్ర సర్వేలో సేకరించిన వివరాల ఫారాలను భద్రపరచాలన్నారు. డాటా నమోదు కోసం అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, సహాయకులను నియమించుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 96.3 శాతం ఎన్యుమరేషన్ పూర్తయ్యిందన్నారు. 11 మండలాల్లో వంద శాతం ఎన్యుమరేషన్ పూర్తయ్యిందని తెలిపారు. మిగతా మండలాల్లో రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. డాటా ఎంట్రీని ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్‌లు పరిశీలించాలన్నారు. లాగిన్‌లో ఉన్న వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, సీపీవో రాజారాం తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సర్వే చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సదాశివనగర్: సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో కుటుంబ సర్వేతో పాటు మండల పరిషత్‌లో చేపట్టిన డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి వ్యక్తి, ప్రతి అంశానికి సంబంధించి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డాటా నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సందర్శించి నిర్వహణ తీరును తెలుసుకున్నారు. కుప్రియాల్‌కు వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో చందర్ నాయక్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, ఏపీఎం రాజిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశమంతా బీజేపీకి ఆదరణ

- ఏడాదికే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిక్రైం: దేశవ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరుగుతోందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం కామారెడ్డిలో ఎమ్మెల్యే సమక్షంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో కమల వికాసం ఖాయమని పేర్కొన్నారు. తెలంగాణలో ఒక్క ఏడాదికే కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చకపోవడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డిలోని అన్ని స్థానాలను బీజేపీ కైవసం చేసుకునేలా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల భరత్, మోటూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మినీ గురుకుల విద్యార్థినులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

మినీ గురుకుల పాఠశాల తనిఖీ

మాచారెడ్డి : మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాలను గురువారం ఉదయం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తనిఖీ చేశారు. ప్రార్థన సమయానికన్నా ముందే పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే.. టీచర్లు, విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? టీచర్లు సక్రమంగా వస్తున్నారా? పాఠాలు బోధిస్తున్నారా? అంటూ విద్యార్థినులను ప్రశ్నించారు. ఏ సమస్య ఉన్నా నిరభ్యంతరంగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం గురించి వాకబు చేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని హెచ్ఎం వెంకటాచారికి సూచించారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే కేవీఆర్

లక్ష్యం సగమే..!

- జిల్లాలో గతేడాది 2.80 కోట్ల చేపపిల్లల పంపిణీ
- ఈసారి 1.40 కోట్లకు తగ్గించిన అధికారులు
- ఇప్పటివరకు వదిలింది 1.05 కోట్లే..
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు



దోమకొండ గుండ్ల చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు (ఫైల్)

దోమకొండ : మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం ఏటా వందశాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈసారి చేపపిల్లల సరఫరా తగ్గిపోవడంతో తమ ఉపాధిపై ప్రభావం పడుతుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి నీటి వనరులు పుష్కలంగా ఉండడంతో చేపల పెంపకంపై మత్స్యకారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సహకార శాఖ ద్వారా ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఈ ప్రక్రియకు టెండర్లు ఆహ్వానించింది. కానీ గతేడాది బిల్లులు సకాలంలో రాకపోవడం వల్ల టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదని తెలిసింది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు.

కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో..

జిల్లాలో గతేడాది 868 చెరువుల్లో 2.80 కోట్ల చేపపిల్లలను వదిలారు. కానీ ఈసారి టెండర్లు పిలిచినా చేప పిల్లలను సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఇతర జిల్లాలనుంచి సర్దుబాటు చేశారు. దీంతో లక్ష్యాన్ని సగానికి కుదించి, 1.40 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయడం ప్రారంభించారు. కాగా ఇప్పటివరకు 717 చెరువుల్లో 1.05 కోట్ల చేపపిల్లలను వదిలారు. నెలాఖరు వరకు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఇతర జిల్లాల నుంచి తెప్పించాం

జిల్లాలో చేపపిల్లల పంపిణీకి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు రాలేదు. దీంతో ఇతర జిల్లాల నుంచి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. దీని వల్ల పంపిణీ లక్ష్యం తగ్గిపోయింది. అయితే ఈసారి 82 ఎంఎం సైజ్‌గల చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్నందున మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇవి త్వరగా ఎదుగుతాయి.

– శ్రీపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి, కామారెడ్డి

క్లుప్తంగా

‘అన్ని విద్యుత్ సమస్యలకు టోల్‌ఫ్రీ 1912’

- ఎస్ఈ శ్రావణ్‌కుమార్



కామారెడ్డి అర్బన్/ఎల్లారెడ్డి: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి జిల్లాలోని అన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు టోల్‌ఫ్రీ నంబర్ 1912ను ప్రదర్శించి విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల విఫలం, విద్యుత్ మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరు, పేరు, లోడ్, కేటగిరీ, చిరునామా తదితరుల సమస్యలు సైతం టోల్ ఫ్రీకి చేసి అడగవచ్చని ఎస్ఈ పేర్కొన్నారు. టోల్‌ఫ్రీకి అందిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందిస్తారన్నారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిపై ఫిర్యాదు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా ఉండి బోయిలకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ మైలారం గ్రామ మత్స్య సహకార సంఘం సభ్యులు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్న పల్లికొండ సాయి బాబ మత్స్య కారులకు రావాల్సిన సంక్షేమ ఫలాలు, ఆదాయానికి గండి కొడుతున్నాడని విమర్శించారు. పదేళ్లుగా సొసైటీ అధ్యక్షుడిగా ఉంటూ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి వచ్చే అభివృద్ధి పథకాలను గ్రామానికి తీసుకుని రాకుండా ఓ బొలెరో, బైకులు కొనుక్కున్నాడని అన్నారు. సంతకాలను ఫోర్జరీ చేసి ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచాడన్నారు. నేతలు రాములు, జయశ్రీ, తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌ను సందర్శించిన డీజీ అనిల్‌కుమార్



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఎస్‌పీఎఫ్ డీజీ అనిల్‌కుమార్ గురువారం సందర్శించారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మహిళా సిబ్బందిని నియమించాలని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ డీజీని కోరారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు మెడ్‌ప్లస్, వరుణ్ మోటార్స్ కంపెనీల వారు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్, సూపర్‌వైజర్, అడ్వైజర్, జూనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్టు, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. ఇంటర్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నగరంలోని శివాజీనగర్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు, 9948748428, 6305743423 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అట్టహాసంగా పాసింగ్ అవుట్ పరేడ్

- శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు
- విధుల్లో చేరేందుకు సిద్ధం
- కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులతో సందడిగా మారిన జాన్కంపేట సీటీసీ



సెల్యూట్ చేస్తున్న డీజీ అనిల్ కుమార్, ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ



కవాతు చేస్తున్న కానిస్టేబుళ్లు

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట వద్ద గల కమిషనరేట్ ట్రెయినింగ్ సెంటర్ (సీటీసీ)లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు ఆయనకు గౌరవ వందనం చేశారు. శిక్షణ సమయంలో ఐదు ఈవెంట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురికి డీజీ మెడల్స్ అందించారు. ఆల్‌రౌండర్‌గా హర్షవర్ధన్, బెస్ట్‌పరేడ్ కమాండర్‌గా జె వాసు, బెస్ట్ ఫైరింగ్ క్రాంతి కుమార్, బెస్ట్ ఇండోర్‌గా రాజ్‌కుమార్, బెస్ట్ అవుట్ డోర్ నరేష్‌కు మెడల్స్ అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 250



మొక్క నాటి నీరు పోస్తున్న డీజీ అనిల్‌కుమార్

ఏఆర్ కానిస్టేబుళ్లుగా ఇక్కడ శిక్షణ పొందారు. కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు హాజరు కావడంతో సీటీసీ ప్రాంగణం సందడిగా మారింది.

శిక్షణ పూర్తిచేసుకున్న సోదరులు

రంగారెడ్డి జిల్లా తలకొండ మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్, శివకుమార్ అన్నదమ్ములు ఒకేసారి కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసి వీరిని చదివించారు. రాఘవేందర్ ఎం ఫార్మసీ, శివకుమార్ బీటెక్ పూర్తి చేశారు. రాఘవేందర్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రిపేర్ కాగా శివకుమార్ కరోనా సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోవడంతో కానిస్టేబుల్‌కు ప్రిపేర్ అయ్యారు. ఇద్దరు ఒకేసారి కొలువు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



తల్లిదండ్రులతో రాఘవేందర్, శివకుమార్

సంతోషంగా ఉంది



మా నాన్న వ్యవసాయ కూలీగా పని చేస్తూ నన్ను చదివించారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడి తల్లిదండ్రుల కోరిక నెరవేర్చా.శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇక్కడ క్రమశిక్షణతోపాటు అన్ని అంశాల్లో తర్ఫీదు పొందాను.

– ఎస్ దేవయ్య, రంగారెడ్డి జిల్లా

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాను. కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాగానే ప్రైవేట్ జాబ్ వదిలి ప్రిపేర్ అయ్యాను. ఉద్యోగం సాధించి ఏఆర్ కానిస్టేబుల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నా.

– సుకుమార్‌రెడ్డి, వికారాబాద్

ఎంతో నేర్చుకున్నా..



కానిస్టేబుల్ శిక్షణ సమయంలో ఎంతో నేర్చుకున్నా. మా నాన్న 14 ఏళ్ల క్రితం చనిపోయారు. అమ్మ లక్ష్మమ్మ, అన్న రాజు ప్రోత్సహించడంతో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ఇద్దరికి నా జీవితాంతం రుణపడి ఉంటాను.

– జి నగేశ్, శంషాబాద్

అమ్మకు అండగా ఉంటా



మా అమ్మ లక్ష్మి అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తూ నన్ను పెద్ద చేసింది. నాన్న అనారోగ్యంతో 10 ఏళ్ల క్రితం మృతి చెందారు. కసితో చదివి కానిస్టేబుల్ జాబ్ సాధించాను. ఇప్పుడు మా అమ్మ, అక్కకు అండగా నిలుస్తాను.

– అనిల్, వెంకటాపూర్, రంగారెడ్డి జిల్లా

కుటుంబ సభ్యుల్లో ఆనందం



కుటుంబ సభ్యులతో సెల్ఫీ తీసుకుంటున్న కానిస్టేబుల్

కఠోర సాధన, ఆత్మవిశ్వాసంతో కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు.. కఠిన శిక్షణతో రాటుదేలారు. తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరడానికి సిద్ధమయ్యారు. ఆ క్షణాలను చూసి వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. జాన్కంపేట సీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఆ అపురూప క్షణాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



















ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- గోదాం రోడ్డులోని కూరగాయల విక్రేతల తరలింపు
- గాంధీ గంజ్‌లో స్థలం కేటాయింపు
- వాహనదారులకు తప్పిన ఇబ్బందులు



గాంధీగంజ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి (ఫైల్)

సుభాష్‌నగర్: నగరంలోని గోదాం రోడ్డులో కూరగాయల వీధి వ్యాపారులకు గాంధీగంజ్‌లో స్థలం కేటాయించడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికింది. నిత్యం ట్రాఫిక్‌తో సతమతమయ్యే ఈ రోడ్డులో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. రోడ్డుకిరువైపులా దుకాణాలు, వాటి ముందు కూరగాయల వీధి వ్యాపారులు, వినియోగదారులతో ప్రతిరోజూ కిటకిటలాడేది. ఈ సమస్యపై ట్రాఫిక్, మున్సిపల్, మార్కెటింగ్ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండేవి. పలుమార్లు పోలీసుల ద్వారా వీధి వ్యాపారులను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం జరిగినా.. మళ్లీ షరా మామూలుగానే మారిపోయింది.



గోదాం రోడ్డులో క్లియర్‌గా ఉన్న ట్రాఫిక్

ఏఎంసీ చైర్మన్ నిర్ణయంతో..

నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డిని బాధ్యతలు స్వీకరించిన తర్వాత మార్కెటింగ్‌శాఖకు సంబంధించి ఒక్కో సమస్యపై సమీక్షించారు. అందులో భాగంగా కూరగాయల వీధి వ్యాపారుల సమస్య తెరపైకి రాగా, గాంధీగంజ్‌లో వీరికి స్థలం కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే, ట్రాఫిక్, మున్సిపల్, మార్కెటింగ్‌శాఖ అధికారుల సమక్షంలో చైర్మన్ నిర్ణయించారు. ఒక్క ఐడియాతో గోదాం రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. షాపుల యజమానులు డబ్బులు తీసుకుని కూరగాయల వీధి వ్యాపారులను ప్రోత్సహించడంపై సీరియస్ అయిన చైర్మన్ గంగారెడ్డి.. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కూరగాయల వీధి వ్యాపారులకు గాంధీ గంజ్‌లో స్థలం కేటాయించారు. అంతకుముందు గాంధీ గంజ్‌లో నెలకొన్న చిన్న చిన్న మరమ్మతులు, సమస్యలకు పరిష్కారం చూపారు. దీంతో ప్రస్తుతం గోదాం రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం లేదు. చైర్మన్ నిర్ణయంపై నగరవాసులు, కూరగాయల వీధి వ్యాపారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన వ్యవసాయ కమిషన్ సభ్యులు



నిజామాబాద్ సిటీ: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం తుమ్మల నివాసంలో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు సభ్యులు గడుగు గంగాధర్ తదితరులు కలిసి శాలువాతో సన్మానించారు. వ్యవసాయ కమిషన్‌కు సంబంధించిన పలు అంశాలు చర్చించినట్లు గడుగు గంగాధర్ తెలిపారు.

‘నన్నెవరూ ఏమీ చేయలేరు’

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ కార్యాయలంలో ఓ అధికారి సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్యా లయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల పై గురువారం సాక్షి పత్రికలో కథనం ప్రచురి తమైంది. ఈ నేపథ్యంలో ఓ అధికారి ఉ ద్యోగు లతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. కార్యాలయానికి సంబంధించిన సమాచారాన్ని బయటకు తెలిపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది. తనను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్న ట్లు సమాచారం. తాను ఇక్కడి వాడిని కానని, బదిలీపై వెళ్లాల్సి వస్తే జిల్లాను అగ్నిగుండం చే స్తానని తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

వ్యవసాయ కుటుంబంలో విద్యా కుసుమాలు

- ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు
- ఇద్దరు కానిస్టేబుళ్లుగా, ఒకరు జీఎన్‌ఎంగా..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుమార్తెలు పుట్టారని ఆందోళన చెందలేదు.. వారికి మంచి విద్యా బుద్ధులు నేర్పించారు. ఉన్నత చదువులు చదివించారు. పూట గడవని పరిస్థితి...అలాంటి సమయంలో కూడా ఆడ పిల్లలను చిన్న చూపు చూడకుండా ఉన్నత చదువులు చదివించి ఉత్తమంగా తీర్చిదిద్దారు. ముగ్గురు ఆడ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేవు. తల్లిదండ్రులు పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని వారు అంటున్నారు. సదా



ముగ్గురు కుమార్తెలతో తల్లిదండ్రులు

శివనగర్ మండలంలోని మోడెగాం గ్రామంలో పతకం సత్యం, సావిత్రిలకు ముగ్గురు ఆడ పిల్లలు. గతంలో పతకం స్వప్న సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ఉద్యోగం చేస్తోంది. అలాగే మరో కుమార్తె సంధ్య ఆరోగ్య శాఖలో జీఎన్‌ఎంగా పని చేస్తోంది. చిన్న కుమార్తె సోనీ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై గురువారం శిక్షణ పూర్తి చేసుకుంది. తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం వల్లే తాము ఉద్యోగాలు సాధించామని వారు చెబుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

బాన్సువాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. అలాగే ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలను గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. మూత్రశాలలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంఈవో నాగేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శంభ్య నాయక్ తదితరులున్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

వర్నిలో ఒకరికి డెంగీ

వర్ని: వర్నిలో ఓ యువకుడికి డెంగీ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తి ఇంటికి గురువారం వైద్య సిబ్బంది వెళ్లి అవగాహన కల్పించారు. జిల్లా డెంగీ నివారణ అధికారి హ క్తర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పరిసరాలను చుట్టుపక్కల 100 ఇళ్లలో దోమల నివారణ మందు పిచికారి చేయించారు.

క్రైం కార్నర్

సౌదీలో నర్సింగ్‌పల్లి వాసి మృతి



షేక్ జమాల్ (ఫైల్)

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ జమాల్ అలియాస్ అహ్మద్ మషూర్ (56) సౌదీ అరేబియాలో బుధవారం రాత్రి గుండె పోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ జమాల్ కొంత కాలంగా ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్తున్నాడు. అక్కడ మున్సిపాలిటీలో ఉద్యోగం చేసేవాడు. కొన్ని రోజులుగా గుండె సంబంధ వ్యాధితో బాధ పడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి గుండెపోటుకు గురై మరణించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన తండ్రి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి రప్పించాలని కుమారుడు జాఫర్ కోరారు.

అనారోగ్యంతో హోంగార్డు..



సాబేరాబేగం (ఫైల్)

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న సాబేరా బేగం (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ వెంకటనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ఆర్మూర్ టౌన్: మద్యం తాగి వాహనాలను నడపొద్దని ఎస్‌హెచ్‌వో సత్య నారాయణగౌడ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గురువారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. బైక్‌పై వెళ్లే వారు హెల్మెట్ పెట్టుకోవాలని అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం ఆరు డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ: పలువురికి గాయాలు



ఇందల్వాయి: ఇందల్వాయి మండలం దేవితండా వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైనట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. వివరాలు.. కామారెడ్డికి చెందిన బోలెనాథ్, స్వరూప, బలరాం కారులో బోధన్ నుంచి కామారెడ్డి వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి బాసర వైపు వెళ్తున్న కారు అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి కామారెడ్డి మార్గంలో వెళ్తున్న వీరి కారుని ఢీకొంది. ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ ఢీకొని బాలుడికి..

రెంజల్: ఇసుక టిప్పర్ ఢీకొని కందకుర్తి గ్రామంలో ఐదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం రాత్రి గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ఢీకొనడంతో బాలుడి కాలు విరిగింది. ఇంటి ముందు రోడ్డు పక్కన నిలబడి ఉండగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై సాయన్నను వివరణ కోరగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రోడ్ నంబర్– 3 లో నివాసం ఉంటున్న ప్రశాంత్ గౌడ్ కుటుంబ సభ్యులు ఆర్మూర్‌లో శుభకార్యానికి వెళ్లారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు, ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ముదిరాజ్ వీధికి చెందిన నట్టల్ నరేశ్(35) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు.. నరేశ్ భార్యతో విడాకులు తీసుకొని తల్లితో కలిసి ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకొని జీవించే నరేశ్ మద్యం తాగి తరుచు తల్లితో గొడవ పడేవాడు. దీంతో ఆమె కూతురికి దగ్గరికి వెళ్లిపోయింది. నరేశ్‌కు అప్పులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

ఒకరి అదృశ్యం



సాయిలు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన తిమ్మపురం సాయిలు(40) కొన్ని రోజులుగా కనిపించక పోవడంతో గురువారం అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. సాయిలు కొంతకాలంగా తన భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పని చేసుకుంటున్నాడు. నాలుగు నెలల క్రితం ఫిట్స్ రావడంతో అతను తన ఇంటికి వచ్చేశాడు. నెలరోజుల క్రితం తిరిగి హైదరాబాద్‌లో పని చేసుకుంటానని తల్లి మాణెమ్మకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. సాయిలు వద్ద ఫోన్ లేకపోవడంతో అతని తల్లి మాణెమ్మ హైదరాబాద్‌లోని కోడలికి ఫోన్ చేసి అడగ్గా హైదరాబాద్‌కు రాలేదని తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. దీంతో గురువారం ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సదాశివనగర్‌లో యువతి..

సదాశివనగర్: సదాశివనగర్‌కు చెందిన ఓ యువతి (25) గురువారం అదృశ్యమైనట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. ఆమె ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.